ఎండిన చెరువులతో ఆందోళనలో అన్నదాతలు

దొనకొండ:

వర్షాభావ పరిస్థితుల్లో ఈ ఏడాది చెరువులు అడుగంటి పోయాయి. ఖరీఫ్ సీజన్ వచ్చి 45 రోజులు కావస్తున్నా సరైన వర్షాలు కురవక చెరువులు ఎండిపోయి చిల్లచెట్లతో దర్శనమిస్తున్నాయి. గేదెలు పశుగ్రాసం కోసం పొలాలకు వెళ్లినప్పుడు దాహం తీర్చుకోవడానికి చెరువులు, కుంటలు, వాగులు, వంకల్లో చుక్క నీరు లేవు. ఇళ్లకు వచ్చి నీరు తాగాల్సిన పరిస్థితి మండలంలో అన్ని గ్రామాల్లో చోటుచేసుకుంది. మండలంలో పంచాయతీరాజ్ చెరువులు 36, ఇరిగేషన్ చెరువులు 11 ఉన్నాయి. గంగదేవిపల్లి, గుడిపాడు, ఎస్ఎస్‌పల్లి, కొచ్చెర్లకోట, రామాపురం, చందవరం, ఇండ్లచెరువు, మంగినపూడి, భూమనపల్లి, వద్దిపాడు, సంగాపురం, పోలేపల్లి చెరువులు చిల్లచెట్లతో నిండి చుక్క నీరు లేక పూడుకుపోయింది. మరమ్మతులు చేపడితేగానీ వర్షాలకు చెరువులు నిండే పరిస్థితి కనబడటం లేదు. మాగాణి బీడుగా మారి పోయింది. అన్నదాతలు మాగాణి భూములను వదిలివేసే పరిస్థితి ఎదురైంది. చెరువుల్లో చుక్క నీరు నిల్వ ఉండక పోవడంతో భూగర్భ జలాలు అడుగంటి ఎండిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. పశువులకు నీటి కొరత ఏర్పడుతుంది. చెరువుల కింద సుమారు 4650 ఎకరాలు ఆయకట్టు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు చెప్తున్నారు. మాగాణి బీడుగా మారితే వరి ఎకరాకు 30 బస్తాలు దిగుబడి వచ్చే అవకాశం లేనట్టే. అన్నదాతలకు సుమారు కోటి రూపాయల నష్టం జరుగుతుందని, అంతే కాకుండా తినడానికి తిండి గింజలు, గేదెలకు మేత లేక గ్రామాల్లోని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలంటున్నారు.


ఎండిన రామాపురం చెరువు


చిల్ల చెట్లతో కొచ్చెర్లకోట చెరువు


పెద్దదోర్నాలలోశిథిలావస్థకు చేరిన నీటి ట్యాంకు


పిల్లర్లకు సంబంధించి ఊడిన పెచ్చులు

శిథిలావస్థలో మంచినీటి ట్యాంకు

- కార్యరూపం దాల్చని తొలగింపు ప్రతిపాదన
- ప్రాణహాని జరగక ముందే చర్యలు తీసుకోవాలని వినతి

పెద్దదోర్నాల: మండల కేంద్రం పెద్దదోర్నాలలో దశాబ్దాల క్రితం నిర్మించిన మంచినీటి ట్యాంకు పూర్తిగా శిథిలమైంది. ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనన్న ఆందోళన స్థానికుల్లో నెలకొంది. ట్యాంకు పరిసర ప్రాంతం వ్యాపార కూడలి కావడంతో అక్కడికి రోజూ వందల సంఖ్యలో వినియోగదారులు వచ్చి వెళ్తుంటారు. కొన్నేళ్ల క్రితం పెద్దదోర్నాల పట్టణ పరిధిలోని ప్రజల మంచినీటి అవసరాలు తీర్చేందుకు ట్యాంకును నిర్మించారు. కొంతకాలంగా ట్యాంకుకు సంబంధించి వివిధ ప్రదేశాల్లో పెచ్చులు ఊడిపోయి ఇనుప ఊచలు బయట పడ్డాయి. అధికారులు కొన్నేళ్లుగా దీనిని వినియోగించడం లేదు. ట్యాంకుకు సంబంధించిన పిల్లర్లు పూర్తిగా బలహీనం కావడంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఈ వాటర్ ట్యాంకును పరిశీలించిన ఇంజినీరింగ్ విభాగం అధికారులు వినియోగానికి పనికిరాదని నిర్ధారించారు. ట్యాంకు నిర్మించిన ప్రాంతంలో ఓ వైపు కూరగాయల దుకాణాలు, మరోవైపు మటన్, చికెన్ షాపులను స్థానికులు దీర్ఘకాలికంగా నిర్వహించుకుంటున్నారు. కొన్ని రోజుల నుంచి ట్యాంకుకు సంబంధించిన కాంక్రీటు పెచ్చులు పైనుంచి ఊడి పడుతుండటంతో ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనన్న ఆందోళన దుకాణదారుల్లో నెలకొంది. రోజులు గడుస్తున్న కొద్దీ నిరుపయోగంగా ఉన్న ట్యాంకును తొలగించేందుకు అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టక పోవటం స్థానికుల్లో విమర్శలకు తావిస్తోంది. మార్కెట్‌లోని వ్యాపారులు భయం, భయంగానే ఇక్కడ వ్యాపారాలు చేసుకుంటున్నారు. క్రమేపి ట్యాంకు పరిస్థితి రోజు రోజుకూ దిగజారుతోంది. ఏక్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వారంతా ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

నూనె గింజల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు శిక్షణ


రైతులతో క్షేత్ర పరిశీలన చేస్తున్న ఏఓ

త్రిపురాంతకం: నూనె గింజల ఉత్పత్తిని ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం నూనె గింజలను పండించే రైతులను ఒక సమూహంగా చేసి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.నీరజ తెలిపారు. మండలంలోని మిట్టపాలెంలో ఆముదం పంటను పండించే రైతులకు క్షేత్ర స్థాయి శిక్షణ తరగతులు ఇప్పటికే నెల రోజులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. రైతులు సలహాలు పొందేందుకు వ్యవసాయాధికారులను సంప్రదించాలని నీరజ సూచించారు.

గద్దర్ గానం అభినందనీయం


గద్దర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

తాళ్లూరు (దర్శి): ప్రజా గాయకులు గద్దర్ గానం అభినందనీయమని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య అన్నారు. స్థానిక అంబేడ్కర్ నగర్‌లో గద్దర్ స్మారక సభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ ప్రజల సామాజిక బాధలను జానపద బాణీలో ప్రజల మాటల్లో కలకాలం గుర్తుండేలా గద్దర్ గానం చేశారన్నారు. కార్యక్రమంలో బంటుపల్లి ఇస్మాయిల్, పులి కోటేశు, ఆరిక జైపాల్‌రావు, సీఆర్పీఎఫ్ ఎస్ఐ జగన్మోహనరావు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

మార్కాపురం: ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో మద్దెల పద్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మంగళవారం జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి షేక్ ఖాశిం, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏఎన్ఎంల దౌర్జన్యాలు అరికట్టాలని, వారు చేయాల్సిన పనులు ఆశాలపై రుద్దుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సునీత రోజ్లిన్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను సన్మానించిన ప్రజాప్రతినిధులు

కంభం: నూతన తహసీల్దార్‌గా వి.కిరణ్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మంగళవారం ఎంపీపీ భర్త చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నల్లబోతుల రామ్మూర్తి, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద సలీం, వైఎస్సార్ సీపీ నాయకుడు డిష్ బాబు మర్యాద పూర్వకంగా కలిసి పూల మాల, శాలువాతో సత్కరించారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని నూతన తహసీల్దార్ తెలిపారు.

నీమాయిల్‌తో పల్లాకు తెగులు నివారణ


పంటను పరిశీలిస్తున్న ఏఓ మహ్మద్

అర్ధవీడు (బేస్తవారిపేట): మినుము పంటలో పల్లాకు తెగులు నివారణకు నీమాయిల్ 500 ఎంఎల్, థయోమిథియాన్ 250 గ్రాములు, 500 గ్రాములు ఫార్ములా–4 ఎకరా పొలానికి పిచికారీ చేయాలని వ్యవసాయాధికారి షేక్ మహ్మద్ అన్నారు. మంగళవారం మండలంలోని నారాయణపల్లెలో పంట పొలాలను ఆయన పరిశీలించారు. పంట వేసిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట నమోదు ఫారం ఆర్‌బీకే సిబ్బందికి అందించాలని తెలిపారు. కౌలు రైతులు తమ దరఖాస్తులను వీఆర్వోలకు అందించాలని కోరారు. ఆర్‌బీకే సిబ్బంది, వీఏఏలు పఠాన్ ఇమ్రాన్‌ఖాన్, మౌనిక పాల్గొన్నారు.

తప్పు చేస్తే ఏ శిక్షకైనా సిద్ధమే

- బోడపాడు సర్పంచ్ రమణారెడ్డి

మార్కాపురం రూరల్: తాను సర్పంచ్ పదవిని అడ్డుపెట్టుకుని భూ అక్రమాలకు పాల్పడినట్లుగా తనపై నిరాధార ఆరోపణలు చేయడాన్ని బోడపాడు సర్పంచ్ రమణారెడ్డి ఖండించారు. తమ గ్రామానికే చెందిన తన బంధువులు కొందరు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ధర్నా చేయడంపై మంగళవారం స్పందించారు. కుటుంబ సమస్యను అక్రమ వ్యవహారంగా చూపడం సరికాదని, తన మామ ఆమె కూతురు కోసం ఇచ్చిన భూమిని ఎలా ఆక్రమించుకుంటానని ప్రశ్నించారు. గడచిన ఐదేళ్లలో తాను అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎవరి భూములనైనా ఆక్రమించినట్లయితే ఆధారాలతో సహా నిరూపించాలని సవాల్ చేశారు. తాను తప్పు చేసినట్లు తేలితే ఏ శిక్షకైనా సిద్ధంగా ఉన్నానని రమణారెడ్డి స్పష్టం చేశారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం


దొనకొండ: తల్లిపాల వారోత్సవాలకు హాజరైన గ్రామస్తులు

- దర్శి సీడీపీఓ భారతి

కురిచేడు: తల్లిపాలు నవజాత శిశువుకు అమృతంతో సమానమని అంగన్‌వాడీ దర్శి క్లస్టర్ సీడీపీఓ సీహెచ్ భారతి పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. తల్లి ప్రసవించగానే మొదటి అరగంటలో వచ్చే ముర్రుపాలు తప్పకుండా బిడ్డకు పట్టాలని, వాటిలో ఎక్కువగా పోషకాలతో పాటు బిడ్డకు అవసరమైన వ్యాధినిరోధక శక్తి ఉంటుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో తెలియక వాటిని పిండిపారేస్తారని, అలా చేయవద్దని సూచించారు. ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ, ఎంపీడీఓ సీతారామయ్య, వైద్యాధికారి ప్రవీణ్, దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

దొనకొండ: స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి కె.సునీత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మంగళవారం తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గొట్టిపాటి లక్ష్మి, తహసీల్దార్ బి.రమాదేవి, ఐసీడీఎస్ సీడీపీఓ భారతి పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు, సలహాలందించారు.

ముండ్లమూరు: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.సునీత అన్నారు. మండలంలోని పెద ఉల్లగల్లు సెక్టార్‌లో తల్లిపాల వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమన్నారు. ప్రతి తల్లి తన బిడ్డకు ఆరు నెలల పాటు విధిగా తల్లిపాలు పట్టించాలన్నారు. రెండేళ్లు నిండే వరకు బిడ్డకు పాలు ఇవ్వవచ్చన్నారు. బిడ్డకు పాలిచ్చే సమయంలో తల్లి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.


తల్లిపాల గురించి వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేయాలి


భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రసాదరావు

తాళ్లూరు (దర్శి): భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని మండలం వ్యవసాయాధికారి ప్రసాదరావు సూచించారు. మండలంలోని నాగంబొట్లపాలెం, అయ్యలపాలెం గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా భూసారం తెలుసుకోవడంపై అవగాహన కల్పించారు. ప్రసాదరావు మాట్లాడుతూ విచక్షణ రహితంగా ఎరువులు వాడితే కాలుష్యం పెరుగడం తప్ప ప్రయోజనం ఏమీ ఉండదని చెప్పారు. భూసార పరీక్షలతో నేలలోని పొరల్లో ఏఏ మూలకాలు ఎంత మోతాదులో ఉన్నాయో చూసుకుని దానిని బట్టి లోపం ఉన్న మూలకాన్ని ఎక్కువ తక్కువలు కాకుండా సిఫారసు మేరకు వాడాలని సూచించారు. మేలైన సాగు పద్ధతుల్లో భాగంగా సజ్జ పంటలో పొలం బడి కార్యక్రమం నిర్వహించి మట్టి నమూనాలు సేకరించి రైతు సేవా కేంద్రానికి 42 చొప్పున 588 మంది రైతులకు మట్టి నమూనాలు సేకరించినట్లు తెలపారు. వీఏఏ డి.శ్రీను, రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలి


మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈవో

పుల్లలచెరువు: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం విషయంలో అశ్రద్ధ చేస్తే ఇబ్బందులు తప్పవని ఎంఈవో శామ్యూల్‌జాన్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మండలంలోని పీవీపల్లి జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం తయారీలో రాజీ పడవద్దని, ప్రభుత్వ మెనూ ప్రకారం రుచికరంగా చేయాలన్నారు. ఇష్టానుసారంగా వంట చేస్తే ఇబ్బందులు తప్పవన్నారు. పాఠశాలలో రోజూ ఉపాధ్యాయులు తప్పనిసరిగా రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు అందజేయాలన్నారు. నాణ్యతలో, రుచిలో తేడాలు లేకుండా హెచ్‌ఎంలు తప్పని సరిగా రోజూ తనిఖీ చేయాలన్నారు. పాఠశాలలోని విద్యార్థులంతా భోజనం చేసే విధంగా ఉపాధ్యాయులు చూడాలన్నారు. ఈయన వెంట హెచ్‌ఎం ఉన్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థులకు త్రిపుల్ ఐటీలో స్థానం

దర్శి: పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో 2023–2024 విద్యాసంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన ముగ్గురు విద్యార్థులు త్రిపుల్ ఐటీలో సీట్లు సంపాదించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ హసీనా బేగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గల్ల జనశ్రీ, బొటుకు వెంకట కౌసల్య, మేకల శృతిలు త్రిపుల్ ఐటీలో సీటు సాదించారు. ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు పి.దీక్షిత, మరియతేజ, ఏవీ అమూల్య, కె.అభిషేక్ ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ అభినందించారు.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ

దొనకొండ: కేరళ వయనాడ్‌లో ప్రకృతి వైపరీత్యంతో సర్వస్వం కోల్పోయిన బాధితులకు సీపీఎం దొనకొండ మండల కమిటీ ఆధ్వర్యంలో విరాళాలు మంగళవారం సాయంత్రం సేకరించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో దుకాణాల వెంట తిరిగి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీపీఎం నియోజకవర్గ నాయకుడు తాండవ రంగారావు, మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ వయనాడ్‌లో కొండ చరియలు విరిగి పడటంతో 350 మందికిపైగా జల సమాధి అయ్యారని, వారం రోజులు గడిచినా 250 మంది ఆచూకీ లభ్యం కాలేదని, గ్రామాలు గ్రామాలే తుడిచి పెట్టుకు పోయాయని, జరిగిన నష్టం అంచనాకు అందకుండా ఉందని, ప్రజలు మానవత్వంతో ఆదుకోవాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విరాళాలు బాధితులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. సీపీఎం నాయకులు చిరుపల్లి అంజయ్య, కర్నా హనుమయ్య, కుందుర్తి చిన్న నర్సింహులు, నాగార్జున, అంజిబాబు, సుధాకర్, వెలుగొండయ్య, కొండా యేసుదాసు పాల్గొన్నారు.


విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

యోగా పోటీలకు దోర్నాల విద్యార్థులు


యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెద్దదోర్నాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు వీరాంజనేయులు, క్రాంతి ప్రసన్నలు జిల్లా స్థాయి యోగా పోటీల్లో అద్భుత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక కావటంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 4వ తేదీన జిల్లా కేంద్రం ఒంగోలు పీవీఆర్ మున్సిపల్ హైస్కూల్లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఇద్దరు విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు సెప్టెంబర్ నెలలో విశాఖపట్నం జిల్లా భీమిలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు రామానాయక్, హెచ్ రామానాయక్, యోగా మాస్టర్ మహేశ్వరరెడ్డి అభినందలను తెలిపారు.

రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి


మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న రైతు సంఘ నాయకులు

దర్శి: అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు మంచా నాగార్జున కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి వి. బాలకోటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పోతవరంలో ఆత్మహత్య చేసుకున్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కౌలు రైతు కుటుంబాన్ని ఆయన మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాలకోటయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధానాలతో ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగాయన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కూడా లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాలతో రైతులు అప్పులపాలవుతున్నారన్నారు. అప్పులు తీర్చలేక భూమిని వదలలేక మానసిక ఒత్తిడికి గురైన రైతులు బాధతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. ఇవి ప్రభుత్వ హత్యలే అని మండిపడ్డారు. ఆత్మహత్యలు పరిష్కారం కాదని, ప్రభుత్వ విధానాలపై పోరాడి వ్యవసాయ రంగాన్ని బతికించుకోవడం కోసం పోరాడాలని రైతులను కోరారు. ఏపీ రైతు సంఘ మండల కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు తాండవ రంగారావు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి


హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

ముండ్లమూరు: ఈ నెల 8వ తేదీన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 52 ప్రాథమిక, ఎనిమిది ప్రాథమికోన్నత, ఎనిమిది ఉన్నత పాఠశాలలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. 68 పాఠశాలల్లో ఎన్నికల సందర్భంగా ఎలాంటి గొడవలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ముందుగా పోలీసుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. గత ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకొని తగిన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నిక సందర్భంగా ఓటు వేసేందుకు వచ్చే సమయంలో ఆధార్‌కార్డు, ఓటరు కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. సమస్యాత్మక పాఠశాలల వివరాలను ముందుగా తెలియజేయాలన్నారు. సమావేశంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.